క్లుప్తంగా

బల్లికురవకు పరీక్ష కేంద్రం మంజూరు

బల్లికురవ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియేట్ పరీక్షలకు పరీక్ష కేంద్రం మంజూరైనట్లు ప్రిన్సిపాల్ కె. సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2001లో ఏర్పాటైన ఈ కళాశాలలో ఇంటర్మీడియేట్ బైపీసీ, ఎంపీసీ, సీఈసీ గ్రూపులు కొనసాగిస్తున్నామని, పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞాపనల మేరకు ఆర్జేడీ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ వీవీ సుబ్బారావు మంజూరు చేసినట్లు చెప్పారు. కళాశాలతో పాటు కేజీబీవీ, వలపర్ల మాగుంట సుబ్బారామిరెడ్డి కళాశాల, ఉన్నత పాఠశాలలో ప్లస్‌టూ విద్యార్థులు ఇక్కడ ఇపరీక్షలు రాశారని చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ విద్యార్థులు మార్టూరు వెళ్లి పరీక్షలు రాయటంతో వ్యయప్రయాసలకు గురయ్యారని చెప్పారు. రెండో సంవతసరం విద్యార్థులకు ఫిబ్రవరి10 నుంచి ప్రాక్టికల్, మార్చి 1 నుంచి మొదటి, రెండో సంవత్సర విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు జరుగుతాయని వివరించారు. పరీక్ష కేంద్రం ఇక్కడకు మంజూరు చేయపటం పై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ



ఇంటర్‌నెట్ ద్వారా సెమినార్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

అద్దంకి రూరల్: జాతీయ సెమినార్‌లో అద్దంకి విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. స్థానిక కట్టా రామకోటేశ్వరరావు డిగ్రీ కళాశాల వృక్ష, గణిత శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'వృక్ష గణితామృతం' అనే శీర్షికతో దేశవ్యాప్తంగా ఉన్న ఉన్న డిగ్రీ విద్యార్థులకు ఇంటర్‌నెట్ వేదికగా విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ కార్యక్రమంలో 775 మంది విద్యార్థులు పాల్గొనగా 46 మంది విద్యార్థులు పరిశోధన పత్రాలు సమర్పించారని చెప్పారు. 20 మంది మౌకిక ప్రదర్శన కనబరచగా ముగ్గురులు విజేతలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీ. మోహన్‌రావు, ఎంవీ సత్యనారాయణ, రామకృష్ణ, షర్మిలారాని, బీ. అశోక్ కుమార్, శిఖామణి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించిన విద్యార్థిని

యద్దనపూడి: యద్దనపూడి ముద్దన హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న షేక్ నజ్మా మార్షల్ ఆర్ట్స్‌లో రాణించి సిల్వర్ మెడల్ సాధించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీల జరిగిన స్టేట్ జూడో టోర్నమెంట్‌లో సబ్ జూనియర్స్ విభాగంలో తృతీయ బహుమతి పొంది సిల్వర్ మెడల్ దక్కించుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈఓ చిలుకూరి గోపి, హెచ్‌ఎం దేవేంద్రరావు, పీడీ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

చీరాల టౌన్: రిసార్టుల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అసాంఘిక కార్యకలాపాలు చేస్తే ఉపేక్షించమని ఈపురుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం, వాడరేవు తీరప్రాంతాల్లో ఉన్న రిసార్టులను ఎస్సై తనిఖీ చేశారు. సంక్రాంతి నేపథ్యంలో తీరప్రాంతాల్లోని రిసార్టుల్లో అక్రమంగా మద్యం నిల్వలు ఉంచడం, పేకాట, మద్యం తాగడాన్ని ప్రోత్సహించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా రిసార్టుల నిర్వహకులకు నోటీసులు అందించారు. ఎస్సై వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి



మధుసూదనరెడ్డిని అభినందిస్తున్న కారంచేడు నాయకులు

కార్యకర్తలకు అండగా నిలబడదాం

- పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి
- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
- ఇన్‌చార్జికి ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డిని కలిసిన చినగంజాం నాయకులు

పర్చూరు (చినగంజాం)/కారంచేడు/చినగంజాం: వైఎస్సార్ సీపీ వెన్నుదన్నుగా ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని ఎవరూ అధైర్య పడొద్దని పర్చూరు వైఎస్సార్ సీపీ నూతనంగా బాధ్యతలు తీసుకున్న గాదె మధుసూదన్‌రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలుత నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ఆయన భారీ స్వాగతం లభించింది. ఆయనకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో స్వాగతం పలుకగా ముందుగా పావులూరు పొలిమేర వీరాంజనేయ స్వామి దేవాలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను ఆయన కలిశారు. వైఎస్సార్ సీపీకి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులు గురించి ఆయన దృష్టికి తీసుకొని రాగా సత్వరం స్పందించిన ఆయన పత్రికా ముఖంగా మాట్లాడారు. కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని ఎలాంటి సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని అన్నారు. త్వరలో నియోజకవర్గం మొత్తం పర్యటించి పార్టీ అభివృద్ధికి ఒక ప్రణాళికను తయారు చేయనున్నట్లు ఆయన వివరించారు. గురువారం ఆయనను కలిసిన వారిలో బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, ఇంకొల్లు, చినగంజాం మండల పార్టీ కన్వీనర్‌లు బండారు ప్రభాకరరావు, మున్నం నాగేశ్వరరెడ్డి, నాయకులు కోట శ్రీనివాసరావు, ఉప్పలపాటి అనిల్, కొసనా రాంప్రసాద్, షేక్ బాబుల్లా, గేరా స్వరాజ్ కుమార్, నూతలపాటి బలరాం, బండి రాంబాబు, పాదర్తి ప్రకాష్, గోరంట్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

మధుసూదన్‌రెడ్డిని కలిసిన చినగంజాం నాయకులు..

నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డిని చినగంజాం మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో పార్టీ ముఖ్య నాయుకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా నాయకులు పావులూరు ఆంజనేయ స్వామి ఆలయంలో మధుసూదన్‌రెడ్డికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన స్వస్థలమైన ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలోని నివాస గృహంలో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అక్కల చంద్రారెడ్డి, కొండూరి గోవింద్, కొల్లా వెంకట సుబ్బారావు చౌదరి, నల్లమోపు సుబ్బారెడ్డి, కొల్లాటి ఏడుకొండలు, పాదర్తి ప్రకాష్, బొడ్డు ఏడుకొండలురెడ్డి, మేడికొండ సునీల్, అసోది సూర్యనారాయణరెడ్డి, కుక్కల రమణారెడ్డి, అంకిరెడ్డి, షేక్ బాబు, వాటుపల్లి రాములు, రామారావు, షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

గాదెను కలిసిన రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి

నియోజకవర్గ ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డిని రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో దగ్గుబాడు మాజీ సర్పంచ్ ముల్లా నూర్ అహ్మద్, మహిళా అధ్యక్షురాలు శివకుమారి, తులసి ఉన్నారు.

– కారంచేడు మండల జేసీఎస్ కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్, నాయకులు యార్లగడ్డ పాపారావు, దగ్గుబాటి సుధాకర్‌లు పర్చూరు ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డిని కలసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులు సమన్వయంగా పనిచేస్తూ కార్యకర్తలకు అండగా నిలబడాలన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావులు, పార్టీ కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్‌లు మధుసూదనరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కమిషన్ బూటకం



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

చీరాల రూరల్: ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్ అంతా వట్టి బూటకమని దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జూలియన్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రధాని మోదీ ఇచ్చిన జడ్జిమెంట్‌గా ఆయన ఆరోపించారు. సీఎం చంద్రబాబు నాయుడుకు నిజంగా దళితులపై ప్రేమ ఉంటే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఉన్న జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం కాకుండా ప్రస్తుత జనాభా నిష్పత్తి ప్రకారం 25 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. దళితుల మధ్య అనైక్యతను సృష్టించడాన్ని దళితులు ఏ మాత్రం చంద్రబాబును క్షమించరని చెప్పారు. భవిష్యత్తులో చంద్రబాబు మాల సామాజిక వర్గం చేతిలో భంగపడక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కేవీపీఎస్ నాయకుడు లింజగం జయరాజు, మల్లెల బుల్లిబాబు, ఎం. రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు క్యాలెండర్ల ఆవిష్కరణ



కోర్టు క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: నూతన సంవత్సర కోర్టు క్యాలెండర్లను గురువారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ రమేష్‌బాబు, అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ బాధ్యుడు అశోక్‌కుమార్‌లు మాట్లాడారు. న్యాయవాది పినిపె ఫౌండేషన్ నిర్మాణం చేసి తొమ్మిదేళ్లవుతుందని అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రతిఏటా న్యాయవాదులకు అవసరమైన కోర్టు క్యాలెండర్లు అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో బండారుపల్లి హేమంత్ కుమార్, సాయిబాబు, రుద్రకుమార్, వెంకటేశ్వరరెడ్డి, మిక్కిలి పుల్లయ్య, పుల్లయ్యనాయుడు న్యాయవాదులు పాల్గొన్నారు.

గృహ సేవల నైపుణ్యాభివృద్ధిపై సదస్సు నేడు

చీరాల: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో చీరాల మున్సిపాలిటీ పరిధిలోని ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్స్, ఏసీ రిపేరు, టీవీ రిపేరు, వాషింగ్ మెషిన్ రిపేరు, బ్యూటీషియన్ కోర్సులు చేసిన వారికి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని కమిషనర్ నజీర్ తెలిపారు. ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు రైస్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం, పాన్‌కార్డుతో దరఖాస్తు అందించాలన్నారు. వివరాలకు 79016 10251, 79016 10228 నంబర్లను సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

నేటి నుంచి ఒంగోలు గిత్తల బలప్రదర్శన పోటీలు

పర్చూరు (చినగంజాం): మండలంలోని అన్నంబొట్లవారిపాలెం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శుక్రవారం నుంచి ఒంగోలు జాతి గిత్తల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో నిర్వహించే జాతీయస్థాయి ఒంగోలు గిత్తల బల ప్రదర్శన పోటీలు ఈనెల 16వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 10న నాలుగు పళ్ల విభాగంలో, 11న ఆరు పళ్ల విభాగంలో, 12న న్యూ కేటగిరి విధానంలో, 13న జూనియర్ విభాగంలో, 14న జూనియర్స్ విభాగంలో, 15న సీనియర్ విభాగంలో, 16న పోలురాధా పోటీలు జరుగుతాయని తెలిపారు. ప్రతి విభాగంలో 9 బహుమతులు ఉంటాయని తెలిపారు.

సమస్యల చట్రంలో తోటవారిపాలెం

- టీడీపీ దిగువ శ్రేణి నాయకుల కర్ర పెత్తనం



గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుద్ధ్యం

చీరాల టౌన్: చేనేతలు, రోజువారీ కూలీలు, అల్ప ఆదాయ వర్గాల ప్రజలు నివశించే గ్రామం తోటవారిపాలెం. జనాభా పరంగా, ఆదాయపరంగా ముందున్న గ్రామంలో సమస్యలు కూడా రాజ్యమేలుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయితీ కార్యాలయాన్ని తమ ఆదాయ వనరులుగా, అడ్డాగా మార్చుకుని అధికారులు, సిబ్బందిపై కర్ర పెత్తనం చెలాయిస్తున్నారు. తమకు ఇష్టం వచ్చిన వారినే కాంట్రాక్టు కార్మికులుగా చేర్చుకోవడంతో పాటుగా పంచాయితీ అధికారులు ఏఏ పనులు చేయాలో మరీ ఆర్డర్లు వేస్తూ పెత్తనం సాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటున్న తమపై టీడీపీ దిగువ శ్రేణి నాయకుల పెత్తనం ఏంటని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో నుంచి ప్లాన్ మంజూరు చేయాలన్నా, ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలన్నా డబ్బులు వసూళ్లు చేస్తున్నారని గ్రామంలో ప్రచారం జోరుగా జరుగుతోంది. కాంట్రాక్టు కార్మికులను తమ ఇష్టం వచ్చిన సొంత పనులకు వినియోగిస్తున్నారని ప్రజలే చెబుతున్నారు. కూటమి నేతలు కర్ర పెత్తనకు పంచాయితీల అధికారులు తోడై ప్రతీ పనికి ఒక రేటును ఫిక్స్ చేసి వసూళ్లు చేస్తున్నారు. సమస్యలను గాలికొదిలేసి కేవలం కూటమి నేతలకు అండగా ఉంటున్నారు పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు. ఎక్కడి చెత్తకుప్పలు అక్కడే ఉండి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని, రాత్రిళ్లు వీధి లైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నా పంచాయితీ అధికారులు తమను పట్టించుకోవడం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జనాభా 6355 మంది, 14 వార్డులు, నివాస గృహాలు 2375 ఉన్నాయి. గ్రామ పంచాయితీ పన్నుల వసూళ్లతో ఏడాదికి రూ. 13 లక్షల ఆదాయం సమకూరుతుంది. పారిశుద్య కార్మికులు, సిబ్బందికి నెలల తరబడి జీతాలివ్వకపోవడం దారుణంగా మారింది.

పంచాయతీ సెక్రటరీ భారతి ఏమంటున్నారంటే..

పంచాయితీలో ఉన్న సమస్యలను నిశితంగా పరిశీలించి వాటిని పరిష్కరిచేందుకు చర్యలు తీసుకుంటాం. నిధులు లేకనే జీతాలు ఇవ్వడం లేదు. వీధి లైట్లుకు మరమ్మతులు చేయిస్తాం. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాం.

మురుగు కాలువలో పడిన కారు



కాలువలో నుంచి కారును తీస్తున్న పొక్లెయిన్

చీరాల: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి మురుగునీటి కాలువలోకి దూసుకెళ్లింది. ఈఘటన గురువారం చీరాల దండుబాటలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కారంచేడుకు చెందిన ఇద్దరు కారులో దండుబాట వైపు వెళ్తూ అదుపుతప్పి మురుగునీటి కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న ఇరువురు కారులోంచి దూకేయడంతో కారు డ్రైనేజీ కాలువలోకి వెళ్లింది. అతివేగం కారణంగానే కారు కాలువలో పడిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్రేన్ సాయంతో డ్రైనేజీలో పడిన కారును తీసివేశారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి వేడుకలు

అద్దంకి రూరల్: దేశంలో మొట్టమొదటి ముస్లిం ఉపాధ్యాయురాలైన షేక్ ఫాతిమా జయంతి కార్యక్రమాన్ని ఏపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం డోలా సువర్ణ పద్మావతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో విద్వాన్‌జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, చెన్నుపల్లి నాగేశ్వరరావులు పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయినులను శాలువతో సత్కరించారు.

ప్రతి ఒక్కరి ఆధార్ నమోదుకు అవకాశం

వేటపాలెం: మండల పరిధిలో ఆధార్ కార్డులు లేని ప్రతి వారికి ఆధార్ కార్డు నమోదుకు అవకాశం కలిప్తామని తహశీల్దార్ పార్వతి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆధార్ కార్డుల నమోదు కోసం పుట్టిన రోజు సర్టిఫికెట్లు లేని 25 మంది యానాదుల చిన్నారులకు గురువారం అందజేశారు. ఆధార్ లేని పెద్ద వారికి కూడా సర్టిఫికెట్‌లు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటగిరి సంజీవరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గందళ్ల నరేష్, కొనిజేటి నగర్ ప్రెసిడెంట్ పీ. శ్రీను పాల్గొన్నారు.

దీన్‌దయాల్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



స్కాలర్‌షిప్‌కి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జే.పంగులూరు: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన దీన్‌దయాల్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబర్ 2004లో రాష్ట్ర స్థాయిలో తపాలశాఖ దీన్ దయాల్ స్పర్శ యోజన ప్రతిభా అన్వేషణ పరీక్ష నిర్వహించింది. ఈపరీక్షలో కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం శ్రీమతి గురువారం తెలిపింది. ఎంపికైన వారికి రూ. రూ.6 వేల స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులు చాతరాజుపల్లి పవన్ గోపికృష్ణ, గుడిపాటి పూజాలోహిత, అమరా అలేఖ్య, సంపంగుల ప్రదీప్తి, చొప్పరపు లాస్య, ఎండ్లూరి వర్షిత్రీలను ఆమె, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ చైర్మన్ రావుల వెంకట నరసింహారావు, గ్రామ పెద్దలు బీ సహదేవుడు, దాత బీ నాగేశ్వరావు, పోస్ట్ మాస్టర్ జి తిరుమలయ్య పాల్గొన్నారు.

500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చీరాల: చిల్లచెట్లలో నాటుసారా తయారీకి వినియోగించేందుకు నిల్వ చేసిన బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. చీరాల ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం రామ్‌నగర్ ఆర్టీసీ గ్యారేజ్ వెనుక చిల్లచెట్లలో నాటుసారా తయారీకి వినియోగించేందుకు నిల్వ చేసిన 500 లీటర్లు బెల్లం ఊటను పారబోసి ప్లాస్టిక్ డ్రమ్ములను ధ్వంసం చేశారు. అలానే వేటపాలెం మండలం జబ్బార్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి 11 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అలానే చినగంజాం రైల్వే గేటు వద్ద మరో వ్యక్తి నుంచి 13 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసి అతడిని అదుపులోకి తీసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎస్సై శ్రీహరి, సిబ్బంది ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి

- ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు
- కోలాటం, వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు



యనమదల పాఠశాలలో సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు



మార్టూరులో భోగి పండ్లు పోస్తున్న ఉపాధ్యాయులు



పెదగంజాంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి: సంస్కృతి, సంప్రదాయాల కలయికే సంక్రాంతి పండుగ అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. పర్వదినాల సదర్భంగా నిర్వహించే వివిధ కళల ప్రదర్శనతో పండగకు మరింత శోభవస్తుందని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవీంద్ర అన్నారు. గురువారం ఐఈఈఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ భాషా సాంస్కృతిక శాఖ ఏపీ వారి సహకారంతో ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థినులతో కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఒకప్పుడు పండుగ అనగానే పల్లెల్లోనూ పట్టణాల్లోనూ కోలాటం, ఎడ్ల ప్రదర్శన, వివిధ ఆటల పోటీలను నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో అటువంటి సంప్రదాయం పురాతన కాలం నుంచి వస్తుందని చెప్పారు. సంక్రాంతి పండుగలో అంకిత భావం, వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యత, గౌరవ భావం మనకు తెలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులకు సంస్థ ప్రెసిడెంట్ బత్తుల కిరణ్‌చంద్ బహుమతులను అందజేశారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అంజు, సీ బ్యాంచ్ ఇన్‌చార్జి గిరి, పీఈఈ బీరావలి, డీసుగుణ, శ్రీలేఖ, బీ కీర్తన, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

చినగంజాం/యద్దనపూడి/మార్టూరు: పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. యద్దనపూడి మండలంలోని యనమదల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పండుగ ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలిపారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ భవానీ మాట్లాడుతూ అన్ని పండుగులను అందరూ గౌరవించాలన్నారు.

- చినగంజాం మండలంలోని పెదగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు ముగ్గుల పోటీలు, బాలురకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డీ నారాయణరెడ్డి, పీడీ ఎం అనిల్ కుమార్, విద్యాకమిటీ చైర్మన్ ఆసోది సుదర్శనరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు,
- సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొబ్బేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లి దండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానంచేశారు. విద్యార్థులకు గాలిపటాల పోటీలు నిర్వహించారు. మార్టూరు రాయల్ స్కూల్ ఆవరణలో మహిళా ఉపాధ్యాయులు భోగి పళ్లు, భోగి మంటలతో అందమైన రంగవల్లు తీర్చిదిద్ది ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
- సంస్కృతి, సాంప్రదాయాల కలయికే సంక్రాంతి పండుగ అని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్ షాఫియా అన్నారు. పర్చూరులోని పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వంహించారు. పల్లెదనం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల కళాకారుల వేషధారణలతో విద్యార్థులు సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోరంట్ల సుబ్బారావు, కరస్పాండెంట్ నాదెండ్ల లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్‌లు సీహెచ్ మాధవి, అలీఉద్దీన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా ఆటల పోటీలు

చీరాల రూరల్: సంక్రాంతి సంభరాలలో భాగంగా న్యాయవాదుల క్రీడా పోటీలు గురువారం ఎంతో సందడిగా జరిగాయి. న్యాయవాదులకు చెస్, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. మహిళా న్యాయవాదులు రకరకాల వంటకాలు తయారుచేసి ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్‌లు పాల్గొని మహిళా న్యాయవాదులతో ఆనందంగా గడిపారు.



ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో కోలాట ప్రదర్శన చేస్తున్న బాలికలు



అద్దంకిలో కోలాటం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అదనపు తరగతి గదులను ప్రారంభించిన గాదె

ఇంకొల్లు (చినగంజాం): పావులూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణం నందు ఎన్నారైల ఆర్థిక సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులను వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బీ అజయ్‌బాబు, హెచ్‌ఎం సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.